కేంద్రాన్ని నిధులు అడగొద్దు

- రాష్ట్రాలకు కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ పాండవియా
- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంత ఆరోగ్యశాఖ మంత్రులతో సమీక్ష

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజారోగ్య సంరక్షణ, వైద్య రంగాలకు కొన్ని రాష్ట్రాల్లో తక్కువ కేటాయింపులు చేయడం, నిధుల వినియోగం తక్కువగా ఉండటం పట్ల కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రంగాలకు కేంద్ర ప్రభుత్వం తగిన కేటాయింపులు జరపడం లేదని, నిధుల వినియోగాన్ని బాగా తగ్గించేస్తోందన్న విమర్శలు చేసేముందు..రాష్ట్రాలే నిధుల పెంపుపై దృష్టి సారించాలని ఆయన ఉచిత సలహా ఇచ్చారు. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం), ఎమర్జెన్సీ కోవిడ్ రెస్పాన్స్ ప్యాకేజీ(ఈసిఆర్‌పి) ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పిఎంఅభిమ్), 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు జాతీయ కరోనా వ్యాక్సిన్ కార్యక్రమం అమలును సమీక్షించడానికి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆరోగ్య శాఖ మంత్రులతో మాండవియా మంగళవారం ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్, ఆంధ్రప్రదేశ్ నుంచి విడుదల రజనీ, టి హరీష్ రావు (తెలంగాణ), వీణా జార్జ్ (కేరళ)తో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాండవియా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బహుళ స్థాయి ఆరోగ్య మౌలిక సదుపాయాల నెట్‌వర్క్‌ను సృష్టించడం, విస్తరించడం, బలోపేతం చేయడం కోసం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో కలిసి కేంద్ర ప్రభుత్వం సహకార సమాఖ్య స్ఫూర్తితో పని చేస్తోందన్నారు. ప్రతి జిల్లా, బ్లాక్‌లలో సంరక్షణ మౌలిక సదుపాయాలపై ఖర్చు చేయాల్సిన అవసరాన్ని మహమ్మారి మనకు నేర్పిందన్నారు. రాష్ట్రాల్లో కేంద్ర నిధుల వినియోగం తక్కువగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం తక్కువ నిధుల వినియోగాన్ని సమీక్షించే బదులు, రాష్ట్రాలు తమ పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. డిసెంబర్ 2022 వరకు ప్యాకేజీ అందుబాటులో ఉన్నందున ఈసిఆర్‌పి కింద కేంద్రం ఇప్పటికే ఆమోదించిన మొత్తం రూ. 23,123 కోట్ల నిధులను వెంటనే వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, విమానాశ్రయాలు, పాఠశాలలు, కళాశాలలు, మతపరమైన యాత్రా మార్గాలు, మతపరమైన ప్రదేశాలు మొదలైన బహిరంగ ప్రదేశాలలో టీకా శిబిరాలను నిర్వహించాలని సూచించారు. 2022 నాటికి రాష్ట్రాలు ఆరోగ్య వ్యయాన్ని తమ బడ్జెట్‌లో 8 శాతానికి పైగా పెంచాలని, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వ్యయం మొత్తం ఆరోగ్య వ్యయంలో మూడింట రెండు వంతులు ఉండాలని 15వ ఆర్థిక సంఘం సూచించిందని తెలిపారు. ఆరోగ్యంలో కేంద్ర ప్రాయోజిత పథకాలు (సిఎస్‌ఎస్) అనువైనవిగా ఉండాలని కమిషన్ సిఫార్సు చేసిందన్నారు.

బీహార్‌లో మంత్రి వర్గం విస్తరణ

పాట్నా : బీహార్‌లో కొత్తగా ఏర్పాటైన మహా కూటమి ప్రభుత్వం మంగళవారం తన మంత్రి వర్గాన్ని విస్తరించింది. మంగళవారం 30 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కూటమిలో అత్యధిక సభ్యులు ఉన్న ఆర్‌జెడికి 16 మంత్రి పదవులు దక్కాయి. జెడియు నుంచి 11 మంది, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, హిందుస్థానీ ఆవామ్ మోర్చా నుంచి ఒకరు మంత్రులుగా ప్రమాణస్వీకారంచేశారు. ఈ నెల ప్రారంభంలో ఎనిమిదో సారి నితీష్‌కుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకోగా, తేజస్వీ యాదవ్ ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. ఈ మంత్రివర్గంలోకి తేజస్వి సోదరుడు తేజ్ ప్రతాప్ చేరారు. నీతీశ్ కుమార్ మునుపటి మంత్రులను దాదాపుగా కొనసాగించారు. అలాగే కీలకమైన శాఖను తన చెంతే ఉంచుకున్నారు. రాష్ట్ర కేబినెట్‌లో ముఖ్యమంత్రితో సహా 36 మంది సభ్యులకు స్థానం ఉంది. తదుపరి విస్తరణలో ఆ స్థానాలు నిండనున్నాయి. అలాగే, ఈ కొత్త ప్రభుత్వం ఈనెల 24న బలపరీక్షకు వెళ్లనుంది.

ఢిల్లీల్లో కరోనా విజృంభణ

- రోజుకు 2వేలకు పైగా కేసులు
- సుమారు 10 మంది మృతి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా కరోనా వ్యాప్తి అదుపులోనే ఉన్నప్పటికీ ఢిల్లీలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రతిరోజు రెండువేలకు పైగానే కేసులు నమోదవుతున్నాయి. ఆసుపత్రుల్లో చేరికలూ పెరుగుతున్నాయి. ప్రతిరోజు సగటున 8-10 మంది మృతిచెందుతున్నట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించాలని సూచిస్తున్నారు. ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ట్వీట్ చేశారు. సోమవారం మినహా గత 12రోజులు డీల్లీలో వరుసగా 2వేలకు పైగానే కొవిడ్ కేసులు నమోదయ్యాయి. సోమవారం 1,227 కేసులు నమోదవగా, పాజిటివిటీ రేటు 14.57శాతంగా ఉంది. ఎనిమిది మంది మరణించారు. అంతకుముందు ఆదివారం 2,162 మందికి పాజిటివ్‌గా తేలింది. ఐదుగురు ప్రాణాలు విడిచారు. కేసుల విజృంభణతో ఢిల్లీ ప్రభుత్వం మాస్కులను తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. మరోవైపు దేశంలో కరోనా రోజు వారీ కొత్తకేసులు తొమ్మిది వేల దిగువకు తగ్గడం ఊరట కలిగిస్తోంది. సోమవారం 2.12 లక్షల మందికి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. 8,813 మందికి వైరస్ సోకింది. పాజిటివిటీ రేటు 4.15 శాతంగా నమోదైంది. 24 గంటల వ్యవధిలో 15,040 మంది కోలుకున్నారు. 29 మంది మరణించారు. ఈ వివరాలను కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం ఉదయం వెల్లడించింది.

బీహార్ మాజీ మంత్రి సుభాష్ సింగ్ కన్నుమూత

న్యూఢిల్లీ : బీహార్ మాజీ మంత్రి సుభాష్ సింగ్ మంగళవారం ఉదయం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం కన్నుమూశారు. బిజెపి ఎమ్మెల్యే అయిన సుభాష్ సింగ్‌కు గతంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. అనారోగ్యం కారణంగా సుభాష్ సింగ్‌ను ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్చి చికిత్స అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు తెలిపారు. సుభాష్ మతి పట్ల బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ సహా పలువురు నేతలు సంతాపం తెలిపారు. సుభాష్ సింగ్ 2015లో గోపాల్‌గంజ్ నుండి బీహార్ శాసనసభకు ఎన్నికయ్యారు.

22న ఎంఎస్‌పి కమిటీ తొలి భేటీ

ఇప్పటికే తిరస్కరించిన ఎకెఎం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భవిష్యత్ వ్యూహాలపై చర్చించడానికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కమిటీ తన మొదటి సమావేశాన్ని ఈనెల 22న నిర్వహించనుంది. ఢిల్లీలో నేషనల్ అగ్రికల్చర్ సైన్స్ కాంప్లెక్స్ (ఎన్‌ఎఎస్‌సి)లో ఉదయం 10.30 గంటలకు సమావేశం జరుగుతుందని అధికారులు తెలిపారు. మొదటి సమావేశంలో కమిటీ సభ్యులను పరిచయం చేస్తుందని, భవిష్యత్ వ్యూహాలపై నిబంధనలలో పేర్కొన్న విస్తృత అంశాలను కవర్ చేయడానికి ఉప ప్యానెళ్లను ఏర్పాటు చేయడం గురించి చర్చిస్తుందని తెలిపారు.

మరోవైపు , రైతు ఉద్యమానికి నాయకత్వం వహించిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నాయకులు ఎంఎస్‌పిపై కమిటీ సమావేశాన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్యానెల్‌ను "ప్రహసనం" అని పేర్కొన్నారు. చర్చల నుండి నిశ్చయాత్మకంగా ఏమీ రాదని పేర్కొన్నారు. 'రైతు వ్యతిరేక ప్యానెల్'ను ఇప్పటికే తిరస్కరించామని, ఆగస్టు 22న జరిగే సమావేశానికి హాజరు కావడం లేదని ఎస్‌కెఎం నేతలు తెలిపారు. ఎస్‌కెఎం నేత హన్నన్ మొల్లా మాట్లాడుతూ ప్రభుత్వ సూచనను తిరస్కరించారు. ఎస్‌కెఎం భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. "మేము ఇప్పటికే ప్యానెల్‌ను తిరస్కరించాము. మేము చర్చలలో పాల్గొనబోమని స్పష్టంగా చెప్పాము. కాబట్టి రాబోయే సమావేశంలో పాల్గొనే ప్రశ్నే లేదు" అని హన్నన్ మొల్లా స్పష్టం చేశారు. "ఢిల్లీ సరిహద్దుల్లో మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా మేము చేస్తున్న ఆందోళనతో సంబంధం లేని కొంతమంది రైతు నాయకులను ప్రభుత్వం ప్యానెల్‌లో చేర్చుకుంది" అని ఆయన విమర్శించారు. "మేము తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాము. మేము ఎలా ప్రదర్శనలు నిర్వహించాలో నిర్ణయిస్తాము" అని ఆయన పేర్కొన్నారు.2021 హింసాకాండకు వ్యతిరేకంగా యుపిలోని లఖింపూర్‌లో 75 గంటల నిరసన తరువాత ఎస్‌కెఎం భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయిస్తుందని మరో ఎస్‌కెఎం నేత దర్శన్ పాల్ అన్నారు. రైతు వ్యతిరేక కమిటీకి తాము ఎలాంటి మద్దతు ఇవ్వడం లేదని, కేంద్రం గత ఏడాది ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నందున తమ నిరసన కొనసాగుతోందని పేర్కొన్నారు. గత ఏడాది రైతు వ్యతిరేక చట్టాల నిరసన సందర్భంగా రైతులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని, ఆందోళనలో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని కూడా తాము డిమాండ్ చేస్తున్నామని దర్శన్ పాల్ చెప్పారు.

సైన్యానికి నూతన ఆయుధాలు అందచేత

న్యూఢిల్లీ : పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఆయుధాలు, సాంకేతిక వ్యవస్థలను కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం భారత సైన్యానికి అందజేశారు. ఫ్యూచర్ ఇన్‌ఫాంట్రీ సోల్జర్ యాజ్ ఏ సిస్టమ్, కొత్త తరం యాంటీ పర్సనల్ మైన్ 'నిపున్', ఆటోమేటిక్ కమ్యూనికేషన్ సిస్టమ్, ట్యాంకులకు ఆధునీకరించిన సైట్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ థర్మల్ ఇమేజర్స్‌తో పాటు ఇన్‌ఫాంట్రీ ప్రొటెక్టెడ్ వెహికల్స్, ల్యాండింగ్ క్రాఫ్ట్ అసల్ట్ బోట్స్‌ను మంత్రి అందజేశారు. ఈ పరికరాలు/వ్యవస్థలను డిఆర్‌డిఒ, డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ సహకారంతో సైన్యం అభివృద్ధి చేసింది. ఈ కొత్త ఆయుధాలతో భారత సైన్యం శక్తి, సామర్థ్యాలు మరింత పెరుగుతాయని, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు సైన్యం సంసిద్ధంగా ఉండేలా దోహదపడతాయని రాజ్‌నాథ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇందులో కొన్ని పరికరాలను మంత్రి నేరుగా సైనిక అధికారులకు అందజేయగా.. బోట్లు, డ్రోన్ వ్యవస్థలను వర్చువల్‌గా సైన్యానికి అప్పగించారు. ఇందులో ల్యాండింగ్ క్రాఫ్ట్ అసల్ట్ బోట్స్ లద్దాఖ్ సరిహద్దుల్లోని పాంగాంగ్ సరస్సులో విధులు నిర్వహించనున్నాయి. ఈ పడవలు 35 మంది యుద్ధ బృందాలను ఒకేసారి తీసుకెళ్లగలవు. అంతేగాక, సరస్సులో ఏ ప్రాంతానికైనా చాలా తక్కువ సమయంలో చేరుకోగలవు. ఈ పడవలను గోవాకు చెందిన ఆక్వారియస్ షిప్ యార్డ్ లిమిటెడ్ తయారుచేసింది. అలాగే శత్రువుల కదలికలపై దృష్టిపెట్టేందుకు వీలుగా తయారుచేసిన డ్రోన్ వ్యవస్థను కూడా ఆర్మీకి అందించారు.

ప్రపంచంపై పెత్తనానికి అమెరికా యత్నం : పుతిన్

మాస్కో: ప్రపంచంపై పెత్తనం చలాయించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విమర్శించారు. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లో శత్రుత్వాన్ని మరింత ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాల సైనికాధికారుల సమావేశంలో మాట్లాడిన పుతిన్.. రష్యా వ్యతిరేక స్థావరంగా ఉక్రెయిన్‌ను అమెరికా మార్చుతున్నందునే అక్కడికి తమ దళాలను పంపామని ఉద్ఘాటించారు. 'పెత్తనం చలాయించడానికి వారికి (అమెరికా) ఘర్షణలు కావాలి. అందుకే ఉక్రెయిన్ ప్రజలకు ఆయుధాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. ఉక్రెయిన్‌లో పరిస్థితులు చూస్తుంటే ఈ ఘర్షణలను మరింత పొడిగించాలని వారు ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లోనూ ఇదే విధంగా వ్యవహరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది' అని పుతిన్ తెలిపారు. అలాగే, తైవాన్‌లో అమెరికా స్పీకర్ నాన్సీ పెలోసి పర్యటించడాన్ని ప్రస్తావిస్తూ.. అది ప్రపంచ వ్యాప్తంగా అస్థిరతను రాజేసే ప్రయత్నమేనని పుతిన్ ఆరోపించారు. స్వార్థపూరిత ప్రయోజనాల కోసం ఇతర దేశాల సార్వభౌమాధికారాలను గౌరవించకుండా అమెరికా ప్రవర్తిస్తోందని మండిపడ్డారు.

పాక్‌లో ఘోరం

- రోడ్డు ప్రమాదంలో 20మంది సజీవ దహనం
- ఆరుగురికి తీవ్ర గాయాలు

ఇస్లామాబాద్ : ఆయిల్ ట్యాంకర్, బస్సు ఢీకొన్న ఘటనలో 20 మంది సజీవ దహనమైన విషాద సంఘటన పాకిస్తాన్‌లోని పంజాబ్ రాష్ట్రం ముల్తాన్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనలో మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. అతి వేగమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ప్రయాణికులతో లాహోర్ నుంచి కరాచీకి హైవేపై వెళ్తున్న బస్సు, ఆయిల్ ట్యాంకర్ ఢీ కొన్నాయి. ఆయిల్ ట్యాంకర్ నుంచి పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. మంటల నుంచి తప్పించుకునేందుకు ప్రయాణికులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. హాహాకారాలు చేస్తూనే మంటల్లో కాలిపోయారు. సమాచారం అందిన వెంటనే అధికారులు, సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అతికష్టం మీద అదుపు చేశారు. తీవ్ర గాయాలైన వారిని ఆసుపత్రికి తరలించారు. అనేక మతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయని, డీఎన్ఏ పరీక్షల ఆధారంగానే వారిని నిర్ధారించాల్సి ఉంటుందని అధికారి వెల్లడించారు. ఈ ప్రమాదంపై పంజాబ్ ముఖ్యమంత్రి పర్వేజ్ ఎలాహీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మతులను గుర్తించి, మతదేహాలు వారి కుటుంబసభ్యులకు త్వరగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పాకిస్థాన్‌లో శనివారం సైతం ఇదే తరహా ప్రమాదం జరిగింది. ఓ బస్సు, ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో 13మంది మరణించారు.

జమ్ముకాశ్మీర్‌లో రోడ్డు ప్రమాదం

ఏడుగురు సైనికులు మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో మంగళవారం భద్రతా సిబ్బందితో ప్రయాణిస్తున్న బస్సు నదిలో పడిన ప్రమాదంలో ఏడుగురు మరణించారు. 37 మంది ఇండో-టిబెటెన్ బోర్డర్ పోలీసులు (ఐటీబీపీ), ఇద్దరు జమ్ముకశ్మీర్ పోలీసులు ప్రయాణిస్తున్న బస్సు అనంతనాగ్ జిల్లాలోని పహల్గం వద్ద బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో బోల్తాపడి నదిలోకి దూసుకెళ్ళింది. ఈ ఘటనలో ఏడుగురు సైనికులు మృతి చెందారు. పలువురుకి గాయాలయ్యాయి. ఈ ఘటనపై ఐటీబీపీ ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. అమర్‌నాథ్ యాత్ర విధుల్లో ఉన్న ఈ భద్రతా సిబ్బంది చందన్‌వారీ నుంచి పహల్‌గామ్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుందని, బ్రేక్ ఫెయిల్ అవ్వడంతో బస్సు రోడ్డు మీద నుంచి నదిలో పడిందని తెలిపారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ఏపి గవర్నరు సంతాపం

కాశ్మీర్‌లోని పహల్‌గామ్ వద్ద ఇండో టిబెటిన్ బార్డర్ పోలీసులకు చెందిన బస్సు ప్రమాదానికి గురై ఆరుగురు ఐటిబిపి సిబ్బంది, ఒక జవాను మృతిచెందడం పట్ల రాష్ట్ర గవర్నరు విశ్వభూషణ్ హరిచందన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విధి నిర్వహణలో భాగంగా ప్రయాణిస్తున్న వాహనం బ్రేకులు ఫెయిల్ కావడంతో లోయలో పడటం దురదృష్టకరమన్నారు. గాయపడిన జవాన్లు త్వరగా కోలుకోవాలని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

వాజ్‌పేయికి నివాళి

మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 4వ వర్ధంతి సందర్భంగా రాజ్‌భవన్ దర్బార్ హాల్లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి గవర్నరు విశ్వభూషణ్ నివాళులర్పించారు.

'బిల్కిస్ బానో' దోషులకు క్షమాభిక్షపై విమర్శలు

న్యూఢిల్లీ : 2002 గోద్రా అనంతర నరమేధంలో భాగంగా బిల్కిస్ బానో సామూహిక అత్యాచారం కేసులో దోషులకు గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదిండంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. గుజరాత్ ప్రభుత్వ నిర్ణయంపై విపక్షాలు మండిపడుతున్నాయి. క్రూరమైన దోషులను ఎలా విడిచిపెట్టారంటూ ఆక్షేపిస్తున్నాయి. క్షమాభిక్ష ద్వారా రేపిస్టులను విడుదల చేసిన గుజరాత్ మిగతావారికి ఆదర్శంగా నిలుస్తోందంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించాయి. దోషుల విడుదలపై బిల్కిస్ బానో కుటుంబం సైతం విచారం వ్యక్తం చేసింది. అత్యాచారం, హత్య కేసుల్లో జీవిత ఖైదు పడిన 11మందిని గుజరాత్ ప్రభుత్వం ఎలా విడుదల చేసిందో అర్థం కావడం లేదంటూ ఆమె భర్త యాకుబ్ రసూల్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. టీవీలో వార్తలు చూసిన తర్వాతే ఈ విషయం మాకు తెలిసిందన్నారు. 'ఖైదీలు తమ దరఖాస్తును ఎప్పుడు ప్రాసెస్ చేశారో, రాష్ట్ర ప్రభుత్వం ఏ లెక్కన దాన్ని పరిగణనలోకి తీసుకుందో అర్థం కావడం లేదు' అని రసూల్ తెలిపారు. 'మా కుమార్తె సహా, ఆ దాడిలో చనిపోయిన వారిని ప్రతిరోజు గుర్తుచేసుకుంటున్నాం. అల్లర్లలో మతిచెందినవారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాం' అని అన్నారు.

మోడీ పాలనలో లౌకికవాదానికి ముప్పు

- హిందూ జాతీయవాదంతో కాషాయమూకలు
- మతవిభజనతో సెక్యులరిజాన్ని దెబ్బ కొట్టే యత్నాలు
- బిజెపి అధికారంలోకి తర్వాత నుంచి ఇదే తీరు
- నిపుణులు, సామాజికవేత్తల ఆందోళన

న్యూఢిల్లీ : దేశంలో మోడీ పాలనలో లౌకికవాదానికి ప్రమాదం ఏర్పడుతున్నది. హిందూ జాతీయవాదం పేరుతో బిజెపి, దాని అనుబంధ సంస్థలు, హిందూత్వ సంస్థలు చెలరేగుతున్నాయి. అన్ని మతాలకు వేదిక అయిన భారత్‌లో సెక్యులరిజాన్ని పడగొట్టే ప్రయత్నాలు చేస్తున్నాయి. ముఖ్యంగా, కేంద్రంలో 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశంలో పరిస్థితులు తిరోగమనంలోకి వెళ్లాయని నిపుణులు, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. హిందూత్వ శక్తులకు ఒక మోడీ పాలన ఒక ఆయుధంగా మారిందని చెప్పారు.

ఆది నుంచీ హిందూత్వ రాజకీయాలు చేసి రాజ్యాధికారం కోసం ఎంతకైనా వెళ్లే స్వభావం బిజెపిదని విశ్లేషకులు చెప్పారు. 1989 నుంచి హిందూత్వ పేరుతో లౌకికవాదం పునాదులను కదల్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఇది హిందూ మతం " విలువలను" భారతీయ సమాజం, సంస్కృతికి మూలస్తంభంగా ప్రచారం చేసే రాజకీయ భావజాలంతో ముందుకెళ్తున్నదని గుర్తు చేశారు. భారత్‌ను లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర దేశం నుంచి నిరంకుశ హిందూ-ఆధిపత్య రాజ్యంగా మార్చటానికి మోడీ పాలన.. శాసన, పరిపాలన, సాంస్కృతిక మార్పులను చేస్తున్నదని ఆలిండియా ప్రగతిశీల మహిళా అసోసియేషన్‌కు చెందిన కవితా కృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు.

దేశంలో 140 కోట్ల మందిలో అధికభాగం హిందువులున్నారనీ, దేశాన్ని హిందూ దేశంగా ప్రకటించాలనే డిమాండ్‌లను మోడీ పాలనలో అనేక హిందూత్వ సంఘాలు వినిపిస్తున్నాయి. రాజ్యాంగాన్ని మార్చటంతో పాటు చట్టాల్లో హిందూ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలని చూస్తున్నాయి. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో బిజెపి నాయకులు చేసిన వివాదాస్పద ప్రకటనలే దీనిని తెలియజేస్తున్నాయని విశ్లేషకులు చెప్పారు.హిందూత్వ విధానాలతో బిజెపి దుందుడుకు స్వభావం దేశంలోని మైనారిటీలను 'రెండో తరగతి పౌరులుగా' పరిగణించేలా చేస్తున్నాయని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా, వివాదాస్ప పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) ను మోడీ సర్కారు తీసుకొచ్చిన విధానాన్ని నిపుణులు గుర్తు చేశారు. రాజ్యాంగంలోని సమానత్వపు హక్కును ఉల్లంఘించే విధంగా ఈ చట్టం ఉన్నదన్నారు. సీఏఏకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ముస్లింలు చేసిన నిరసనలు, ఆందోళనలను గుర్తు చేశారు. అలాగే, ఇస్లాం రాజులను హిందూ ద్వేషిలుగా చిత్రీకరించటంలో కాషాయ సమూహాలు తమ ప్రయత్నాలతో ముందుకు సాగుతున్నాయని విశ్లేషకులు చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ స్వల్పకాల వ్యవధి టెండర్ ప్రకటన

నెం. 2-8/2022-23, తేది: 10.08.2022
కోనసీమ జిల్లాలో టిఆర్27 ఫండ్స్ కింద రూ.91.00 లక్షల వ్యయం గల 7 పనులకు ఆన్‌లైన్ టెండర్లు పిలువబడుచున్నవి. టెండర్ షెడ్యూల్‌లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా https://www.apeprocurement.gov.in 17.08.2022 ఉ.10.30గం.ల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. చివరి తేది: 24.08.2022

సం/- కార్యనిర్వాహక ఇంజనీర్,
ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్ డివిజన్, అమలాపురం.

DIPRNo:5579/CL/ADVT/1/1/2021-22

కాలిఫోర్నియాలో కుల వివక్ష

- టెక్ కంపెనీల్లోను కుల జాడ్యం
- అమెరికా వివక్ష చట్టాల్లో మార్పు కోసం ఉద్యమం

వాషింగ్టన్ : వివిధ వర్గాల మధ్య అంతరాలను పెంచుతూ భారత్‌లో పాతుకుపోయిన వర్ణవ్యవస్థ (కులాలు) అమెరికాలోనూ ప్రభావం చూపుతోంది. అమెరికాలో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా కులం పేరిట వివక్షతను ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. నైపుణ్యం ఉన్నప్పటికీ .. దళితులైన అభ్యర్థులను ఉన్నతస్థాయి అధికారులుగా నియమించేందుకు టెక్ సంస్థలు వెనకాడుతున్నాయి. ఈ వివక్షపై అమెరికా న్యాయస్థానంలో దావా కూడా దాఖలైంది. ఈ కేసు ద్వారా అక్కడ భారతీయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివక్షలు వెలుగుచూశాయని రాయిటర్స్ సర్వేలో తేలింది. కులం అనే వర్గాన్ని కొన్ని కంపెనీలు పెద్దగా పట్టించుకోవడం లేదని తేల్చింది.

ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన టెక్ కంపెనీలు అమెజాన్, డెల్, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్ సహా అనేక కంపెనీలు తమ కంపెనీ నిబంధనల్లో కుల వివక్ష కేటగిరిని చేర్చడం లేదని పేర్కొంది. ప్రపంచంలోనే అతిపెద్ద లిస్టెడ్ కంపెనీ అయిన ఆపిల్ జాతి, మతం, లింగం, వయస్సు, మూలాలతో పాటు కులం ఆధారంగా ఉద్యోగుల మధ్య వివక్షతను నిషేధించడానికి సుమారు రెండేళ్ల క్రితమే ఈ పాలసీని తీసుకువచ్చినట్లు తెలిపింది. ఐబిఎం టెక్ సంస్థ కూడా కులం కేటగిరీని తమ కంపెనీ నిబంధనల్లో చేర్చినట్లు తెలిపింది. ఈ రెండు సంస్థలు మినహా మిగతా పెద్ద టెక్ సంస్థలు కుల వివక్షను పట్టించుకోవడం లేదు. ఈ రెండు సంస్థలు కూడా తమ నిబంధనల్లో అయితే చేర్చాయి కానీ వాస్తవంగా కుల వివక్ష లేకుండా చేయలేకపోతున్నాయని ఉద్యోగులు పేర్కొన్నట్లు రాయిటర్స్ తెలిపింది. "టెక్ కంపెనీల నిబంధనల్లో అస్థిరత ఉండటంతో నేను పెద్దగా ఆశ్చర్యపోలేదు" అని కుల సమస్యలపై అధ్యయనం చేసే సౌత్ కరోలీనా విశ్వవిద్యాలయ న్యాయ ప్రొఫెసర్ కెవిన్ బ్రౌన్ ఈ నివేదికపై స్పందించారు. చట్ట పరిధిలో లేనపుడు ఈ పరిస్థితే ఎదురవుతుందని అన్నారు. దీంతో అమెరికా వివక్ష చట్టాల (యుఎస్ డిస్క్రిమినేషన్ లాస్) కింద కులం కేటగిరీని చేర్చాలని పలు ఉద్యోగ సంఘాలు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నాయి.

అమెరికా వివక్ష చట్టం ఏం చెప్తోంది..

ఉద్యోగులకు శిక్షణ, నియామకాలు, పదోన్నతులు కల్పించడంలో వివక్షతను చూపకూడదని అమెరికా వివక్ష చట్టాలు పేర్కొంటున్నాయి. జాతి, రంగు, పూర్వీకుల అంశం, ప్రాంతాలు, మతం, వయస్సు, సాంప్రదాయాలతో పాటు అంగవైకల్యం, లింగ గుర్తింపు, లైంగిక ధోరణి